


పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

## రోడ్డెక్కిన 'డబుల్ ఇండ్ల' లబ్ధిదారులు

**వెంటనే ఇండ్లు అప్పగించాలని డిమాండ్**

పెద్దపల్లి, మార్చి 14: పెద్దపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. కేటాయించిన ఇండ్లను వెంటనే అప్పగించాలని డిమాండ్ చేస్తూ, గురువారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. 'పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం.. ఇందిరమ్మ రాజ్యం తెస్తాం' అని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, పేదోడి సొంతంటి కలను కలగానే మార్చే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో చందపల్లి, కునారం రోడ్‌లో 484 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి రిజర్వేషన్ ప్రాతిపదికన లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టి, ఎంపికైన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. రెక్కాడితే గానీ డొక్క నిండని పరిస్థితి తమదని, కిరాయి కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తే మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గడువు ముగిసినా ఇండ్లు అప్పగించకపోవడంతో కలెక్టర్‌ను కలువడానికి వస్తే కలెక్టర్ లేరని అకారులు చెబుతున్నారని వాపోయారు. తమ గోడు చెప్పుకుందామంటే ఇటు ఎమ్మెల్యే కలుస్తలేడు.. అటు కలెక్టర్ కలుస్తలేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై లక్ష్మణ్‌రావు సముదాయించినా వినలేదు. ఎస్సై చొరవ తీసుకొని ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో ఫోన్‌లో లబ్ధిదారులతో మాట్లాడించారు. నాలుగు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇవ్వడంతో లబ్ధిదారులు రాస్తారోకో విరమించారు.

## కువైట్‌లో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కువైట్‌లో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఎన్నారై శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కువైట్ శాఖ అధ్యక్షురాలు గొడిశాల అభిలాష కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కవితకే దక్కిందని కొనియాడారు. మహిళల సమస్యలపై, వారి హక్కులపై పోరాడుతున్న కవిత అందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేశ్‌గౌడ్, ప్రమోద్‌కుమార్, అయ్యప్ప, రవి సుధగాని తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూర్‌లో కిడ్నాప్ కలకలం

మోత్కూరు, మార్చి 14: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో కిడ్నాప్ ఘటన కలకలం సృష్టించింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గురువారం మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక ఎస్‌బీఐ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రాంతంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి చిన్నారులకు చాక్లెట్ల ఆశ చూపి ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. వారు ఓ చిన్నారికి చాక్లెట్ ఇస్తుండగా నిరాకరించిందని, బలవంతం చేసి ఇస్తుండగా ఎవరని ప్రశ్నించిన ఓ పెద్ద మనిషిని గమనించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయం పట్టణమంతా వ్యాపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులకు చెందిన మహీంద్ర కారుగా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు.

# సీఎం రేవంత్ ఇలాకాలో నీళ్లొచ్చాయ్

- *దోరేపల్లిలో బైపాస్ పైపులైన్ ఏర్పాటుతో సమస్యకు చెక్*

**నమస్తే ఎఫెక్ట్**

*నారాయణపేట, మార్చి 14: నారాయణపేట జిల్లా మద్దూరు మండలం దోరేపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను గురువారం అధికారులు పరిష్కరించారు. గ్రామంలో మొత్తం 526 మంచినీటి నల్లా కనెక్షన్లు ఉన్నాయి. పూర్తిస్థాయిలో నీటి సరఫరా లేకపోవడంతో గ్రామస్థులు బుధవారం మద్దూరు-కోస్గి రోడ్డుపై ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో 'సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాలో తాగునీటికి కటకట' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో గురువారం ఫొటోవార్త ప్రచురితమైంది. ఈ మేరకు మిషన్‌భగీరథ ఈఈ రంగారావు, ఏఈ చెన్నయ్య, పంచాయతీ సెక్రటరీ రాజయ్యగౌడ్ స్పందించారు. హుటాహుటిన గ్రామానికి చేరుకొని 25 మీటర్ల కొత్త బైపాస్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించారు. పనులు పూర్తి చేసి మంచినీటిని వదిలారు. అంతేకాకుండా నల్లాలకు ఎవరూ హాఫ్ హెచ్‌పీ మోటర్లు పెట్టకుండా పర్యవేక్షించారు. కోయిల్‌కొండ నుంచి వచ్చే పైప్‌లైన్‌కు మూడ్రోజుల కిందట మరమ్మతు చేయడం జరిగిందని మిషన్‌భగీరథ ఏఈ చెన్నయ్య తెలిపారు. గ్రామంలో చాలామంది నల్లాలకు మోటర్లు పెట్టడంతో ప్రెషర్ తగ్గి ఎత్తు ప్రాంతంలో ఉన్న ఇండ్లకు నీళ్లు వచ్చే పరిస్థితి ఉండేది కాదని, ఈ సమస్య పరిష్కారం కోసం బైపాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిని వదిలామని వివరించారు. నీటి సమస్య తీరడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.*



దోరేపల్లిలో బైపాస్ పైప్‌లైన్ కోసం చేపడుతున్న పనులు

## ఏటీఎంలో 20 లక్షలు చోరీ

రుద్రూర్, మార్చి 14: దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి రూ.20 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. రుద్రూర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా బ్లాక్‌కలర్ పెయింట్ స్ప్రే చేశారు. అనంతరం ఏటీఎంను ధ్వంసం చేసి నగదుతో ఉడాయించారు. చోరీ విషయం గురువారం ఉదయం వెలుగులోకి రావడంతో పోలీసులు ఏటీఎం దగ్గరికి చేరుకుని వివరాలు సేకరించారు. ఏటీఎంలో ఉన్న రూ.20 లక్షలు అపహరణకు గురైందని బ్యాంకు అధికారులు తెలిపారు.

## • హంసవాహనంపై యాదగిరీశుడు



*యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి అలంకార సేవోత్సవంలో భాగంగా గురువారం నృసింహస్వామి ఉదయం వటపత్రశాయి అలంకార సేవలో, రాత్రి హంసవాహనంలో ప్రధానాలయ మాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. – యాదగిరిగుట్ట*



*సిరిసిల్ల కొత్త బస్టాండ్ వద్ద రిలే దీక్ష చేస్తున్న నేతన్నలు*

## సిరిసిల్లలో నేత కార్మికుల రిలే దీక్ష

**ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్**

రాజన్న సిరిసిల్ల, మార్చి 14 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లలో నేత కార్మికులు ఆందోళనకు దిగారు. గురువారం సీఐటీయూ, వపర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద 24 గంటల రిలే దీక్ష చేపట్టగా, బీఆర్ఎస్ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ.. సిరిసిల్ల నేతన్నలపై కాంగ్రెస్ సర్కారు కక్ష కట్టిందని ఆరోపించారు. పదేండ్లపాటు నిరంతరాయంగా నడిచిన మరమగ్గాల పరిశ్రమకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వకపోవడం, పెండింగ్‌లో ఉన్న బకాయిలు రూ.290 కోట్లు విడుదల చేయని కారణంగా వస్త్ర పరిశ్రమ స్తంభించిపోయిందని విమర్శించారు. రాజకీయాలు పక్కన బెట్టి, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే బకాయిలు విడుదల చేయడంతోపాటు వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. బతుకమ్మ చీరలకు ఇందిర, ప్రియాంక, సోనియా ఇలా ఏదో పేరు మార్చి అయినా నేతన్నలకు ఉపాధి కల్పించి బతుకులకు భరోసా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దనే పార్సిళ్ల పికప్, డెలివరీ

- **ఆర్టీసీలో లాజిస్టిక్స్ నెట్‌వర్క్ విస్తరణ**
- **దిల్‌సుఖ్‌నగర్‌లో కొత్త కౌంటర్**
- **త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ**
- **టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్**

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో లాజిస్టిక్స్ విభాగ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తున్నామని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ మోడల్ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం లాజిస్టిక్స్ విభాగం లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించి, పార్సిళ్లను ఇంటి దగ్గరి నుంచి సేకరించడం, డెలివరీ కోసం వినియోగించే కొత్త వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. సజ్జనార్ మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం రాష్ట్రంలో అతివేగంగా పార్సిళ్లను డెలివరీ చేసే వ్యవస్థ అన్నారు. ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్‌లో పార్సిళ్ల హోం పికప్, డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. లాజిస్టిక్స్ సేవలపై సలహాలు, సూచనలకు 040-69440069, https//www.tsrtclogistics.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు. టీఎస్‌ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పురుషోత్తం, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సీటీఎం(కమర్షియల్) శ్రీధర్, హైదరాబాద్ ఆర్ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## • కేయూలో వైద్య విద్యార్థుల నిరసన



*వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని వైద్య విద్యార్థులు గురువారం తరగతులు బహిష్కరించి కళాశాల పరిపాలన భవనం నుంచి ప్రధాన ద్వారం వరకు నిరసన ర్యాలీ తీశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్టు కేఎంసీ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. – వరంగల్ చౌరస్తా*

